

# ఎవరు గొప్ప

పట్టు వదలని బేతాళుడు అలసి పడిపోయిన విక్రమార్కుడిని భుజాలపై వేసుకుని అతని బరువుని మోయలేక నడవలేక నడుస్తూ అన్నాడు విక్రమార్కుడితో "రాజా నిన్ను మొయ్యలేక చస్తున్నా...నాకు శ్రమ, అలసట తెలియకుండా ఉండేందుకు ఏదన్నా ఓ కథ చెప్పు" అంటూ ప్రార్థించాడు. విక్రమార్కుడు కథ మొదలెట్టాడు.

అనగనగా ఓ వూరు. ఆ వూర్లో అచ్చమ్మ, బుచ్చమ్మ అను ఓ యిద్దరు స్నేహితురాళ్ళు వుండేవారు. వాళ్ళు ఎంత గొప్ప స్నేహితులు అంటే బుచ్చమ్మ కంట్లో నలక పడితే అచ్చమ్మ తన కంటిని పీకేసినంతగా యిదైపోతుంది. అచ్చమ్మను వాళ్ళాయన కోప్పడితే బుచ్చమ్మను తన మొగుడు కట్నం తీసుకు రాలేదని కిరోసిన్ పెట్టి తగలేసినట్టు బాధపడిపోతుంది. ఒకరంటే ఒకరికి ఎంతో యిది.

ఇద్దరికి చీరలంటే మోజు. అసలు చీరల కోసమే ఆడజన్మ ఎత్తినట్టు అనుకొంటుంటారు అందరు. చీరలను గురించి మాట్లాడమంటే రోజులు రోజులు అనర్గళంగా ఉపన్యాసాలివ్వగలరు. ఇద్దరికీ పట్టు చీరలే పదిపదిహేను వున్నాయి. ఇక మామూలు చీరల సంగతి సరేసరి. కొత్త చీర మార్కెట్టులోకి వచ్చిందంటే, అది తమ శరీరాన్ని చుట్టుకున్న దాకా వాళ్ళకు నిద్రపట్టదు. చీర కొనటానికి సమయానికి డబ్బు లేకపోతే ఇంట్లో పాత చీరలు, స్టీలు సామాన్లు, ఆఖరికి మొగుడు కుట్టించుకున్న కొత్త బట్టలు, సహితం అమ్మి పారెయ్యటానికి ఎంత మాత్రం సందేహించరు.

ఓసారి అచ్చమ్మకు ఒంట్లో నలతగా వుంటే చీరల షాపింగుకు బుచ్చమ్మ ఒక్కతే వెళ్ళింది. ఓ గంటసేపు షాపులో వున్న చీరలన్ని చూపింది. ఎంత సేపు చూపినా తనకు నచ్చిన చీర దొరకలేదు. చీరల ధరలు, వాటి గుణగణాలు చెప్పలేక షాపువాళ్ళకు నాలుక పిడచకట్టుకుపోయింది. అంత పెద్ద షాపు కూడా, బుచ్చమ్మకు నచ్చిన ఒక్క చీరా చూపించలేకపోయింది.

తనకు నచ్చిన చీర దొరకనందుకు బాధపడుతూ, యింత సేపూ ప్రశ్నలతో షాపు వాడిని చీల్చి చెండాడినందుకు సంతోషపడుతూ యింకో షాపుకు వెళ్ళింది. మొత్తానికి ఓ నాలుగైదు షాపులు చూశాక కాని తనకు కావలసిన చీర దొరికింది కాదు. చీర కొన్నాక తృప్తిగా యింటిముఖం పట్టింది. దాని ధర మాత్రం మూడొందలు.

తను తెచ్చిన చీరను బుచ్చమ్మ అచ్చమ్మకు చూపించి ధర మాత్రం మూడొందల యాభై అంది. అచ్చమ్మ లోలోపల దాని ధర అంత వుండదు అనుకుని, పైకి నవ్వుతూ, "డబ్బు పోతే పోయింది చీర చాలా బావుంది" అంది.

బుచ్చమ్మ చీర కొన్నది కాబట్టి అచ్చమ్మ కూడ చీర కొనాలి, కొంటుంది కూడా. చీర కొనటానికి బయలుదేరుతూ బుచ్చమ్మను తోడుగా తీసుకెళ్ళాలనుకొంది. అంతలోనే వుద్దేశాన్ని మార్చుకుని ఒంటరిగానే వెళ్ళింది షాపింగుకు.

అచ్చమ్మ బుచ్చమ్మ లిద్దరూ వూర్లో బట్టల షాపుల వాళ్ళందరకూ తెలుసు. వాళ్ళు వస్తున్నారంటే షాపుల వాళ్ళకు భయం. మొత్తం చీరలు తీయించి మడతలు విప్పతారని. ఎంత రాచి రంపాన పెట్టినా కష్టమర్ని ఎవరూ ఒదులుకోరు కదా! అందుకే హుందాగా, సొంత యింటిలోనికి వస్తున్నట్టు వస్తున్న అచ్చమ్మను, సాదరంగా ఆహ్వానించారు షాపువాళ్ళు.

మొత్తానికి నాలుగైదు గంటల షాపింగు తరువాత అచ్చమ్మకు ఓ చీర దొరికింది. దీని ధర కూడా మూడొందలే. ఆమె సంతోషంగా యింటి ముఖం పట్టింది.

తన స్నేహితురాలు ఎలాంటి చీర తెస్తుందోనని బుచ్చమ్మ తిండి, నీళ్ళు మానేసి ఆత్రంగా ఎదురు చూస్తుంది యింటి దగ్గర. అచ్చమ్మ తన చీరను బుచ్చమ్మకు చూపించి,' ముందు చీరను మెచ్చుకోనిచ్చి, తను ఆ మెచ్చుకోలుకు సంతోషపడి ఆ తరువాత పేల్చింది బాంబు. 'చీర ధర రెండొందల యాభయ్యని'. బుచ్చమ్మకు మతి పోయినంత పనయింది. స్నేహితురాలికి యింత మంచి చీర అంత తక్కువ ధరకు దొరికినందుకు బాధ కూడా కలిగింది.

కథ ముగించిన విక్రమార్కుడు బేతాళుడితో యిలా అన్నాడు "బేతాళా! కథ సాంతం విన్నావుగా... అంత గొప్ప స్నేహితురాళ్ళు, ఏ అరమరికలు లేకుండా యిన్నాళ్ళు వున్న వాళ్ళు, మన స్నేహాన్ని ఒక్క మృత్యువు తప్ప ఎవరూ విడదీయలేరనుకున్న వాళ్ళు ముష్టి మూడొందల చీర కోసం ఒకరి కొకరు అబద్ధం ఎందుకు చెప్పకొన్నారు? ఈ ప్రశ్నకు జవాబు తెలిసి కూడ చెప్పక పోయావా, నువ్వు ప్రకాశం జిల్లాలో పత్తి రైతుగా పుడతావు జాగ్రత్త."

బేతాళుడికి నిజంగా భయం వేసింది ప్రశ్నకు జవాబు చెప్పలేకపోతే పత్తి రైతుగా పుట్టాల్సొస్తుందేమోనని. స్మశానంలో ప్రేత గణాలతో సరదాగా వుండే వాడికి, ఆడవాళ్ళ గురించి, వాళ్ళ చీరల గురించి ఏం తెలుసు?

"మహా రాజా...చాలా క్లిష్టమైన ప్రశ్న అడిగావు. బుద్ధి తక్కువై నిన్ను కథ చెప్పమన్నాను. ఇంత యిరకాటంలో పెడతావనుకోలేదు. అయినా సమాధానం కోసం ప్రయత్నిస్తా, పత్తి రైతుగా పుట్టమని మాత్రం శపించకు.

"అచ్చమ్మ బుచ్చమ్మలు గొప్ప స్నేహితురాళ్ళే. ఒకరి రహస్యాలు ఒకరికి చెప్పకొనేవారే...అయితే ఆడవాళ్ళు చీరలు, సొమ్ముల దగ్గర కొచ్చేసరికి ఓ విధమైన పోటీ లాంటిది ఏర్పడుతుంది. ఈ పోటీని దృష్టిలో పెట్టుకుని అచ్చమ్మ బుచ్చమ్మల్లో ఎవరు గొప్పవాళ్ళో తెలుసుకోవచ్చు."

"బుచ్చమ్మ మూడొందల చీరను మూడొందల యాభైకి కొన్నట్టు చెప్పి, తను ఖరీదయిన చీరలే కొంటాను అనే విషయాన్ని అచ్చమ్మకు పరోక్షంగా తెలియచెప్తూ తనలోని ఒక విధమైన 'యిగో'ని తృప్తి పరచుకొంది."

'ఇక అచ్చమ్మ విషయం-మూడొందల చీరను రెండొందల యాభైకి కొన్నట్టు చెప్పి, తను తెలివిగా తక్కువ ధరకే మంచి చీరను కొనగలను అనే విషయాన్ని బుచ్చమ్మకు తెలియజేసి తనలోని 'యిగో'ని తృప్తి పరచగలిగింది.

"మహారాజా...యిక, వీళ్ళిద్దరిలో గొప్ప వాళ్ళెవరు అని కదూ మీరడిగింది. వినండి...వీళ్ళిద్దర్లో అచ్చమ్మే గొప్పది. ఎందుకంటే...బుచ్చమ్మ ఎక్కువకు కొన్నానని చెప్పి తనను మాత్రమే తృప్తి పరచుకోగలిగింది. అచ్చమ్మ తక్కువకు కొన్నానని చెప్పి తనను తృప్తి పరచుకొంటూనే, బుచ్చమ్మను బాధపెట్టగలిగింది."

బేతాళుడు చెప్పిన సమాధానం విని విక్రమార్కుడు స్పృహ తప్పాడు.

— భాను